# కొత్తగొంతులు

ఎండలో పొలం నుంచి తిరిగొచ్చిన పాండు భోంచేసి వరండాలో మంచంమీద నడుం వాల్చాడు. అతని భార్య సరళ కూడా నాలుగు మెతుకులు తిని గబగబా వంటింటి పని ముగించుకొచ్చింది. భర్తతో ముఖ్యమైన సంగతి చెప్పాలనుకుంది. అయితే, అప్పటికి పాండు నిద్రలోకి జారుకున్నాడు. వరండాలో గోడకు ఆనుకుని కూర్చుంది. భర్త కదిలితే మాట్లాడడానికి సిద్ధంగా వుంది. మనస్సులో ఆలోచనలు ముసురుకున్నాయి.

పాండును పాండురంగం అంటే తెలిసినవాళ్ళు చాలా తక్కువ. ఆ మాటకొస్తే అందరికీ తెలిసింది భూషయ్య కొడుకని. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే 'మీసాల భూషయ్య కొడుకు. మోతుబరి భూషయ్య పేరు వినని వాళ్ళు సింగాపురం చుట్టుపట్ల లేరు. భారీ విగ్రహం. పెద్దతరహా మనిషి. మంచి మాటామంతీ, అందర్నీ ఆకట్టుకునే సౌజన్యం. ఉపకారగుణం. ఇతరులకు సాయం చేయడంలో ముందు భూషయ్య పేరు చెప్పాలి. సాగు పనుల్లో దిట్ట. దుక్కి దున్నడం మొదలు పంటనూర్చి ఇంటికి చేర్చడం వరకు అన్నీ క్షుణ్ణంగా తెలిసినవాడు. సేద్యంలో ఎవరికే ఇబ్బంది వచ్చినా చక్కటి సలహా ఇవ్వగల నేర్పరి.

పాండు భూషయ్య మొదటి భార్య పూర్ణమ్మ కొడుకు. పూర్ణమ్మ పేరుకు తగ్గట్టు చక్కదనాలన్నీ ఆవిడ సొత్తు. లక్ష్మీదేవిలా వుండేది. సుగుణాలు మూర్తీభవించిన వ్యక్తి. గుండెనిండా దయ నింపుకున్న పూర్ణమ్మ ఉపకారానికి మారుపేరు. చూలింతలకు కన్నతల్లిలా తోడ్పడేది. ఆడపిల్లల్లో సగంమందికి పూర్ణమ్మ పేరు పెట్టుకున్నారంటే ఆమె పట్ల ఎంత కృతజ్ఞత వుండేదో వెల్లడవుతుంది. మంచి వాళ్ళని దేవుడు త్వరగా పిలుచుకుపోతాడంటారు. పూర్ణమ్మే అందుకు నిదర్శనం. అందరికీ చేతనైన సహాయం అందిస్తూ మానవసేవే మాధవ సేవ అని నమ్మిన పూర్ణమ్మ హఠాత్తుగా కన్నుమూసింది. అందరూ కన్నీరు మున్నీరుగా విలపించారు.

పూర్ణమ్మ రత్నాలలాంటి ఇద్దరు బిడ్డల్ని భూషయ్యకు అప్పగించి తిరిగిరాని లోకాలకు తరలి పోయింది. కొడుకు పాండు, కూతురు రాధ అందంలో తల్లిని పోలారు. పాండుకు చదువు అబ్బలేదు. వ్యవసాయంలో తండ్రికి ఆసరాగా వుంటున్నాడు. రాధ మంచి పనితనం పెంచుకుంది. తెలివిగలది. చదువుల్లో దిట్ట. ఇటు ఇంటిపనీ, అటు చదువూ చక్కగా సాగించడం రాధ ఓర్పుకు తార్కాణం. సింగాపురం హైస్కూల్లో పదోతరగతి పరీక్ష రాసింది. అప్పుడు భూషయ్య పెద్ద ఆలోచనలో పడ్డాడు. రంగం పేటలో కాలేజీచదువు సాగించాలని ఉత్సాహపడుతోంది.

దగ్గరే కాబట్టి రోజూ వెళ్ళి వస్తానని అంటోంది. ఇంటిపనికి ఎలాంటి లోటు రానివ్వనని తండ్రికి హామీ ఇచ్చింది.

తెలివిగల పిల్ల ఇంటిపనుల్లో మునిగి తేలుతుంటే చదువు ఎలా కుదురుతుందని భూషయ్య సందేహంలో పడ్డాడు. ఇందుకు రెండు మార్గాలున్నాయి. రాధను చదువు మాన్పించడం ఒక పద్ధతి. ఇక రెండోమార్గం ఇంట్లో మరో ఆడదిక్కు గురించి ఆలోచించడం. నిజానికి రెండో పెళ్ళి చేసుకోమని భూషయ్యను ఇదివరకే దగ్గరి బంధువులు ఒత్తిడి చేశారు. దానిని గురించి భూషయ్య అప్పట్లో ఎక్కువ ఆలోచించలేదు. ఈ పరిస్థితుల్లో రెండో పెళ్ళే సరైన మార్గం అని తోచింది. తలూపడం తడవుగా శాంతమ్మతో పెళ్ళి ఖాయపర్చారు. ఒడ్డూ పొడుగు వున్న శాంతమ్మకు ముప్పై అయిదేళ్ళు దాటాయి. మనిషి నలుపయినా భూషయ్య కళ్ళకు చామనచాయలా తోచింది.

శాంతమ్మ రాకతో ఆ యింటి వాతావరణమే పూర్తిగా మారిపోయింది. రాగానే పూర్ణమ్మ కీర్తిని విన్న శాంతమ్మ గుండెలు భగ్గుమన్నాయి. చీటికి మాటికి ఆ వూరి ప్రజలు పూర్ణమ్మ పేరు తలవడం శాంతమ్మకు సుతరామూ ఇష్టం లేదు. ఆ సంగతి కుండ బద్దలుకొట్టినట్లు చెప్పేసింది. అంతే. శాంతమ్మ ఎదురుగా ఎవరూ ఆ వూసు ఎత్తేందుకు ధైర్యం చేయలేదు. పులిలాంటి భూషయ్యను పిల్లిలా మార్చేసింది. రాధను రాచిరంపాన పెడుతుంటే భూషయ్య నోరు మెదపలేకపోయాడు. ఇంటిపని అంతా రాధ నెత్తిన పెట్టి శాంతమ్మ వడ్డీ వ్యాపారం సాగించింది. ఇంటి పనులు త్వరగా అవడం కోసం మరో ఆడమనిషి అవసరమని పేద కుటుంబం పిల్ల సరళను ఆ యింటి కోడలిగా తెచ్చింది. అత్తగా పెత్తనం చెలాయించడం మొదలుపెట్టింది. పాండు నోట్లో నాలుక లేనివాడు. నోరు మెదపలేకపోయాడు. శాంతమ్మ గయ్యాళి శాంతమ్మగా తన మాటే శాసనంగా చెలాయిస్తోంది.

సరళ సౌమ్యురాలు. తెలివిగల అమ్మాయి. ఆ కుటుంబ పరిస్థితుల్ని బాగా అర్థం చేసుకుంది. చాకచక్యంతో వ్యవహరించసాగింది. ఆ యింటి కోడలుగా తనపై వున్న బాధ్యతలు గుర్తించింది. ముందు రాధ చదువు గురించి తీవ్రంగా ఆలోచించింది. రంగంపేటలో భూషయ్య చెల్లెలు మాణిక్యమ్మ వుంది. అన్ని సంగతులు వివరిస్తూ ఎవరికీ తెలియకుండా పాండును పంపింది. రాధ మీద సరళకు ఎంత అభిమానమో మాణిక్యమ్మ వెంటనే గ్రహించింది. తల్లిలేని రాధంటే ఆమెకు కూడా ఎంతో జాలి, ప్రేమ. తప్పకుండా తన దగ్గరుంచుకుని చదివిస్తానని పాండుకు మాట ఇచ్చి పంపింది.

సింగాపురం మునసబు రాజన్న కొడుకు భద్రం రంగంపేట కాలేజీలో చదువుతున్నాడు. సరళ అతని ద్వారా ఫారాలు తెప్పించి భర్తీ చేసి దాఖలు చేయించింది. ఈ పనులన్నీ గోప్యంగా జరిగిపోయాయి. రాధ పదో తరగతి ఫస్ట్ క్లాసులో ప్యాసయింది. అప్పుడు సరళ రాధ పైచదువు గురించి అత్తమామలకు చెప్పింది. భూషయ్య మౌనంగా వుండిపోయాడు. శాంతమ్మ కస్సుమంది. ఇంట్లో

వరసపెట్టి అందర్ని తిట్టిపోసింది. హంగామా చేసింది. సరళ తొణకలేదు. జంకలేదు.

'రాధకు కన్నతల్లి లేకపోవచ్చు. ఆ స్థానంలో వదినగా నేనున్నాను. రాధ కాలేజీలో చేరుతుంది. అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. అందరం సంతోషంగా దీవిద్దాం' అని సూటిగా చెప్పింది. అంతా అవాక్కయ్యారు.

నాలుగేళ్ళు గడిచాయి. రాధ బి.ఏ. డిగ్రీ పరీక్ష రాసింది. రంగం పేటలో రాధ ఒక విద్యార్థిని మాత్రమే కాదు. అందరికీ తలలో నాలుక. రాధంటే ఆ వూరంతా గొప్ప వెలుగుగా భావించింది. ఎందరినో స్వచ్ఛంద కార్యకర్తలుగా తీర్చిదిద్దింది. రంగంపేట రాత్రి బడిని ఆదర్శంగా భావిస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే - అన్ని జన జీవన రంగాలలోనూ రాధ రంగంపేట ప్రజల దృక్పథాన్ని మార్చివేసింది. మహిళల్లో వచ్చిన చైతన్యం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. రాధపై నిలుపుకున్న ఆశలు, ఆకాంక్షలు ఫలించినందుకు సరళ హృదయం ఆనందంతో ఉరకలెత్తింది.

పాండు మంచంమీద ఒత్తిగిల్లి ఆవలిస్తూ 'కాసేపు పడుకోపోయావ్?' అంటూ భార్యను పలకరించడంతో సరళ ఉలిక్కిపడి, తెప్పరిల్లి గతం ఆలోచనల నుండి బయటపడింది.

'మీ కునుకు అయిపోతే మీతో ఒకటి రెండు విషయాలు మాట్లాడాలను కుంటున్నాను' అంది పాండు వంక చూస్తూ.

పాండుకు ఆ మాటలు వింతగా తోచాయి. ఎవరూ తనతో పెద్దగా సంప్రదించరు. సరళ ధైర్యంగా మంచి పనులు చేస్తున్న సంగతి పాండుకు తెలుసు. భూషయ్య బస్తీకి వెళ్ళాడు. శాంతమ్మ వాళ్ళ అన్నను చూసేందుకు రెండు రోజుల క్రితం వూరెళ్ళింది. నేడో రేపో రావలసి వుంది. ఇంట్లో ఇంకెవరూ లేరు కాబట్టి తనతో ఏదో సంగతి చెప్పాలనుకుంటుందేమోనని పాండు భావించాడు. అయినా జంకుగానే వుంది. తన మీదకి ఏదైనా ముంచుకొస్తుందేమోనని బెరుకు వెంటాడుతోంది.

'దేనిని గురించి... కొంపతీసి రాధకి ఇంకా ఇంకా పైచదువులు చెప్పించాలను కుంటున్నావా?' నీళ్ళు నమిలాడు.

'అందులో తప్పేమిటి? అన్నగా మీరు ఏం పట్టించుకోలేకపోయినా నాకాబాధ్యత వుంది. ఆ పిల్లకు పుట్టింటికి సంతోషంగా రాలేని పరిస్థితి కల్పించారు. మీ పిన్ని అన్ని మాటలంటుంటే ఒక్కమాటైనా చెప్పలేకపోయారు.'

'అది సరే... నువ్వు చెప్పదలచుకున్న సంగతేమిటి?'

'అంత తొందరెందుకు? చెబుతా. మీరందరూ నన్ను పిల్లలు పుట్టనిదానికింద జమకట్టారు. సహించాను. నిజం చెబుతున్నా. మీరైనా నమ్మండి. నమ్మకపోయినా నాకేం చింత లేదు. రాధ చదువు అయ్యేవరకూ మనకు బిడ్డలు పుట్టకూడదని నేను మాత్రలు వాడాను ఇంతవరకు. అర్థమయ్యిందా?' సరళ నిలదీసినట్లు చెప్పింది.

పాండు బిత్తరపోయాడు. ముఖంలో భయం ఆవరించింది.

'అదంతా మీకనవసరం. మరో సంవత్సరంలో మీకో అమ్మాయో, అబ్బాయో పుట్టడం ఖాయం! సరళ కళ్ళలో మెరుపు కనిపించింది.

పాండుకు అయోమయంగా తోచింది.

'ఇదేనా నువ్వు చెప్పాలనుకుంది?'

'మరొకటుంది. రాధను ఇవ్వాళ ఇక్కడికి నేను రప్పిస్తాను.' పాండు నెత్తిన పిడుగుపడినట్లయింది.

'అమ్మో... పిన్నికి తెలిస్తే కొంపలంటుకుంటాయి.' గాబరాగా చెప్పాడు.

"ఏమీ అంటుకోవు. అన్నింటికి సిద్ధపడే ఈ పని చేస్తున్నా... పెళ్ళికాని పిల్లకు మీతోపాటే అన్ని హక్కులున్న సంగతి మీకు తెలియకపోవచ్చు. మీ అమ్మ బదులు నేనున్నా... అర్థమయిందా?'

సరళ వైఖరి చూసి పాండు బెంబేలెత్తిపోయాడు.

'మీరేం హడలిపోకండి. రాధతోపాటు మాణిక్యమ్మ పిన్ని వస్తోంది. ముందుగా వాళ్ళిద్దరూ మునసబు గారింటికి వస్తారు. ఆ తర్వాత మనింటికి నేను తీసుకువస్తాను. మరోమాట. మీ నాన్న ఈ సాయంకాలంలోపే వచ్చేస్తారు. మీ పిన్ని కూడ ఇవ్వాళే రావచ్చు. అందుకే ఇవ్వాళ రాధ వస్తోంది.'

పాండుకి ఏమీ పాలు పోలేదు. రాధ వస్తున్నందుకు ఒకపక్క సంతోషం. ఇంట్లో గొడవ జరుగుతుందేమోనని మరోవైపు భయం.

సరళ లేచి ఇంటిపని చూసుకోవడానికి లోపలికి వెళ్ళింది.

పాండు మనస్సంతా గందరగోళంగా వుంది. ఏమీ తోచక వీధి గుమ్మందగ్గర నిలబడ్డాడు.

ఉన్నట్టుండి లోపలికొస్తూ 'సరళా... సరళా!' అని గావుకేక పెట్టాడు.

సరళ ఇవతలికొస్తూ 'ఏమయిందండీ?' అని అడిగింది.

'నాన్న, రాధ, మాణిక్యమ్మత్తా... కలిసి వస్తున్నారు.' పాండుకు చెమటలు పోస్తున్నాయి. మాటలు తడబడుతున్నాయి.

సరళ కూడా ఆశ్చర్యపోయింది. ఈ కలయిక అర్థం కాలేదు. ఎలా జరిగిందో వూహించుకోగలిగింది. మునసబు రాజన్నగారింట్లో కలుసుకుని వుండొచ్చని అనుకుంది. అక్కడ ఏమైనా గొడవపడ్డారేమోనన్న శంక లేకపోలేదు.

గుండె నిబ్బరం చేసుకుని వీధిలో వాళ్ళకి ఎదురు వెళ్ళి మాణిక్యమ్మనూ, రాధనూ ఆప్యాయంగా పలకరించింది. 'మామయ్యా, మీరూ రావడం ఇదేనా?' అని అడిగింది.

'అవునమ్మా!' ఆ గొంతులో కొత్త ఆప్యాయత పలికింది. కోపగుణం కనిపించ లేదు. సరళకు మనస్సు కుదుటపడింది.

అందరూ లోపలికొచ్చారు. కాళ్లూ చేతులూ కడుక్కున్న తర్వాత సరళ చల్లటి మజ్జిగ తెచ్చి ఇచ్చింది.

రాధ ఇల్లంతా కలియ తిరిగొచ్చింది. సంతోషంతో ఉబ్బితబ్బిబ్బులవుతోంది. సరళ రాధను అక్కున చేర్చుకుంది. ఆనందబాష్పాలు జలజల రాలాయి. సంతానవతి కాకముందే మాతృత్వం ఇచ్చే ఆనందానుభూతిని పొందగలిగినందుకు సరళ తాను ధన్యురాలననుకుంది.

వాలు కుర్చీలో కూర్చున్న భూషయ్య చేతులు మీసాలపైకి వెళ్ళడం గమనించిన సరళ ఆశ్చర్యపోయింది. తాను కాపురానికి వచ్చిన తర్వాత అలా చూడడం ఇదే ప్రథమం.

భూషయ్య సకిలించాడు. అంటే - ఏదో చెప్పబోతున్నాడని అర్థం.

'అమ్మాయ్!' అంటూ సరళ వైపు ఆర్ద్రంగా చూశాడు.

పాండు, సరళ నివ్వెరపోయారు.

'ఏం మామయ్యా?' సరళ బదులు పలికింది.

'చిన్నదానివైనా నీది ఎంత గొప్ప మనసు తల్లీ! ఇంతకాలం కళ్ళుండీ చూడలేకపోయాను. బస్సు దిగి వస్తుంటే మునసబు పిలిస్తే వెళ్ళాను. పక్కగదిలో మా చెల్లెమ్మ, రాధ, భద్రం మాట్లాడుకుంటున్నారు. మునసబు సైగ చేస్తే అన్నీ విన్నాను. నేనెంత మూర్ఖంగా ఇంతకాలం ప్రవర్తించానో అర్థమయింది. నా బిడ్డను ఇంతదాన్ని చేసిన ఘనత నీకే దక్కుతుంది. కడుపులో పెట్టుకుని చూసిన మా మాణిక్యమ్మ మనస్సు దొడ్డది..' భూషయ్య చెబుతున్నాడు.

'నాదేం వుందిలేరా అన్నయ్యా!... రాధ రంగం పేటకే వెలుగిచ్చిందిరా! అంతా విన్నావుగా? బి.ఏ. అయిపోయింది సరళ మూలంగా. రాధను ఒక ఇంటిదాన్ని చేసే బాధ్యత నీదేరా!....' చిరునవ్వుతో చెప్పింది మాణిక్యమ్మ.

'అన్నీ మీరే చేసి నాకు వూరికే పెత్తనం ఇస్తున్నారు కదూ! మీ మాటలు విన్నాను చెల్లమ్మా! రాధ అభిప్రాయం గ్రహించాను. భద్రం మంచి కుర్రాడు. ఇద్దరు భావాలు ఒక్కటే. సింగాపురాన్ని ఆదర్శప్రాయంగా చేయాలనుకుంటున్నారు. చిన్న పరిశ్రమ పెట్టి, తమతోపాటు ఇతరులకు పని కల్పించాలనుకుంటున్నారు. నేనూ, మునసబూ అది విని ఎంతో సంబరపడ్డాం చెల్లమ్మా!'

'అబ్బో... అబ్బో! నేను వింటున్నది భూషయ్యన్నయ్య మాటలేనా?... నా జన్మ తరించిందిరా అన్నయ్యా. దేవుడు ఇంత కాలానికి రాధమ్మని కరుణించాడు. సరళ కోరిక నెరవేరింది. అయితే ఇంక ఆలస్యం ఎందుకు? మా వదిన కూడా కాదనదులే. ఏర్పాట్లు చేసుకో.. మూట సిద్ధం చేసుకోరా అన్నయ్యా!'

నవ్వులు రాలాయి.

'చెల్లమ్మా!... భద్రం సంగతి తెలుసుగా? కట్నం దగ్గరికి రానిచ్చే మనిషి కాదు. నేనొకటి అనుకుంటున్నా.. ఆ డబ్బుతో ఊళ్ళో మీ వదిన పేర 'పూర్ణిమ వికాస కేంద్రం' కట్టించాలనుకుంటున్నా. ఇందులో ఇక ఎవర్నీ అడిగే సమస్య లేదు...' భూషయ్య కంఠంలో స్థైర్యం నిండివుంది.

అందరూ బాగుందన్నారు.

ఇంతలో వీధి గుమ్మంలోంచి సంచి పట్టుకుని శాంతమ్మ రావడం గమనించి ఆశ్చర్యపోయారు.

రాధ వెంటనే లేచివెళ్ళి శాంతమ్మ పాదాలకు నమస్కరించి కళ్ళకు అద్దుకుంది. రెండు చేతులతో రాధను పైకి లేపి పొదివి పట్టుకుని గుండెలకు హత్తుకున్న శాంతమ్మను చూసి విస్తుపోయారు.

'పిన్నీ! నన్ను క్షమించి దీవించు పిన్నీ!' రాధ అర్థించింది.

'పిన్నిని కానమ్మా!... ఈ క్షణం నుంచి అమ్మను. పాత శాంతమ్మ చచ్చిపోయింది. రంగంపేటలో నీ మీద జనాలందరికీ వున్న అభిమానం విన్నానమ్మా! నా కళ్ళు తెరుచుకున్నాయి. ఇక నీ భారం అంతా ఈ అమ్మదేనమ్మా! సరేనా తల్లీ?' శాంతమ్మ గొంతులో మాతృత్వ మధురిమలు జాలువారాయి.

'అలాగేనమ్మా!... అమ్మా! అమ్మా!! అమ్మా!!!' రాధ శాంతమ్మని చిన్నపిల్లలా పెనవేసుకుని తనివితీరా అన్న ఆ పిలుపులు అనంత దూరాలు దాటి, అమరధామంలో వున్న పూర్ణమ్మ దివ్య కర్ణాలకు అమృతప్రాయాలయ్యాయి.

*('ఆంధ్రప్రదేశ్' - ఆగస్టు, 2000)*